

సమష్టి కృషితో ఎన్నికలు : కలెక్టర్ నాగరాణి



భీమవరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె ఇరు శాఖల అధికారులతో సమీక్షించారు. 'నీటితీరువా వసూలు, శివారు భూములకు నీటి విడుదల, తదితర అంశాలను నీటి పంపిణీ సంఘాల ద్వారా నిర్వహిస్తాం. జిల్లాలో వున్న ఒక ప్రాజెక్టు కమిటీ పరిధిలో 20 నీటి పంపిణీ కమిటీలు ఉన్నా యి. జిల్లాలో 112 నీటి వినియోగదారుల సంఘాలకు గాను 98 మేజర్, 14 మైనర్ సంఘాలు ఉన్నాయి. మేజర్ సంఘాల్లో 12 మంది సభ్యుల చొప్పున, మైనర్ సంఘాల్లో ఆరుగురు సభ్యుల చొప్పున ఉంటారు. అక్టోబరు 31న ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా జాబితా ప్రకటన, వీటిపై నవంబరు 1, 2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, వాటిని 3న పరిష్కరించి తుది విడుదల చేస్తాం. 6 నుంచి 10 వరకు భూయజమానుల జాబితా, ఓటర్ల జాబితా తయారీ, 11, 12 అభ్యంతరాల స్వీకరణ, 13న వాటిని పరిష్కరించి తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తాం. నవంబర్ 20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. 21 నుంచి 23 మధ్య నీటి సంఘాల సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 24 నుంచి 26 మధ్య నీటి పంపిణీ సంఘాలకు, నవంబర్ 27, 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి' అని కలెక్టర్ వివరించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, నీటిపారుదలశాఖ అధికారి పి.నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలతో సాగుదాం


సాగు లేక బీడు బారిన భూమి

- నీటి సంఘాలతో సాగు కష్టాలకు చెక్
- రైతుల సమస్యలు.. రైతులే పరిష్కరించుకునేలా..
- గత చంద్రబాబు పాలనలో ఏడాదికి రూ.20 కోట్లతో పనులు
- తర్వాత వైసీపీ పాలనలో అన్నీ గడ్డు రోజులే
- కూటమి ప్రభుత్వం రాకతో సంఘాల ఏర్పాటుపై రైతుల ఆనందం

భీమవరం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):సాగు రైతులకు చేయూతనందించేందుకు నీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం కనుమరుగు చేసింది. దిగువ స్థాయిలో సాగు ఇబ్బందులు చెప్పుకునేందుకు నీటి సంఘాలు లేక అవి పరిష్కారం కాక రైతులు అవస్థలకు గురయ్యారు. పర్యవసానంగా పంట పంటకు సాగు భూమి తగ్గుతూ వచ్చింది. కౌలు రైతులు సాగు వైపు చూడలేని పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ హయాంలో జిల్లాలో రెండు లక్షల 50 వేల ఎకరాల సాగు నుంచి రెండు లక్షల 20 వేలకు, ఈ ఏడాది సార్వాలో లక్ష 95 వేల ఎకరాలకు పడిపోయింది. కాలువల అభివృద్ధి చేయక సాగునీటి ఇబ్బందులు, మురుగునీటి సమస్యలు తలెత్తడం రైతులకు సాగు భయంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 62 కాలువలను అభివృద్ధి చేసేందుకు రూ.9 కోట్లతో పనులు చేపట్టింది. కొంతవరకు సాగును గట్టెక్కించినా ఐదేళ్లుగా కాలువల అభివృద్ధిలో నిర్లక్ష్యం, రైతు సంఘాలు లేని లోటు ఇప్పటికి రైతులను సాగులో వెంటాడుతూనే ఉంది.

నీటి సంఘాల పనితీరు ఇలా

నీటి సంఘాల ఏర్పాటుకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. నీటి సంఘాలలో ప్రాజెక్టు కమిటీ, నీటి పంపిణీ సంఘాలు, నీటి సంఘాలుగా ఏర్పడతాయి. ఈ సంఘాలలోని సభ్యులు సాగు జరుగుతున్న ప్రాంతాల్లోని రైతులే. వారికి సంబంధించిన ప్రాంతాలలో సాగు సమస్యలను అక్కడి రైతులు తోటి రైతుగా సంఘ సభ్యులకు సమాచారాన్ని ఇస్తారు. దీనివల్ల నీటి సంఘం తరఫున సమస్యను ప్రభుత్వ అధికారులకు చేరవేయడం, దాన్ని పరిష్కరించే చర్యలు చేపడుతూ వస్తారు. నీటి సంఘాల ద్వారా వైసీపీకంటే ముందు ప్రభుత్వాలు కోట్ల రూపాయలతో కాలువల అభివృద్ధి, చెత్త, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేయించేవారు. కెమికల్ పిచికారీలు, సిల్టు తొలగింపుల్లో నీటి సంఘాలు బాధ్యతగా వ్యవహరించేవి. గత టీడీపీ ప్రభుత్వంలో ఏడాదికి రూ.20 కోట్ల చొప్పున నీటి సంఘాల ఆధ్వర్యంలో సాగుకు సహకరించేలా కాలువల అభివృద్ధి, గేట్ల ఏర్పాటు, అవసరమైన తూరల ఏర్పాటు, చెత్త తొలగింపు వంటి పనులు చేపట్టారు.

నీటి ఎద్దడి సమయంలో..

దాళ్వా పంటకు వచ్చేసరికి ప్రతీ ఏడాది పదేళ్ళుగా నీటి వంతులవారీ విధానం ఆనవాయితీగా మారింది. దీంతో ఈ వంతుల వారీ విధానంలో నీటి సంఘాలు ప్రధానపాత్ర పోషిస్తూ వచ్చాయి. ఎందుకంటే సంఘాలలోని సభ్యులు రైతులు కావడం ఆ ప్రాంతాల్లోని కాలువలు ఏ విధంగా సరఫరా చేస్తాయన్నది అవగాహన ఉంటుంది. దీంతో దాళ్వా సాగు నారుమడుల దశలలోనే ఇరిగేషన్, అగ్రికల్చర్, సంబంధిత అధికారులతో నీటి సంఘాలు జిల్లా సమావేశాలు నిర్వహించేవారు. ఏ ఆయకట్టుకు ఎంత నీరు వదలాలి, ఏ ప్రాంతంలో ముందు సాగు, వెనుక సాగు వివరాలను తెలిపి వంతుల వారీ విధానంలో ప్రణాళిక తీసుకొచ్చేవారు. కాలువలు పొంగినా, గట్లకు గండ్లు పడినా నీటి సంఘాలే అప్రమత్తం చేసేవి.

రైతు సమస్యలకు చెక్



రైతులకు నీటి సంఘాలు ఎంతో అవసరం. వీటి ద్వారా టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడేళ్లలో రూ.60 కోట్లతో కాలువలు, ఇతర పనుల అభివృద్ధికి ఉపయోగించేవారు. రైతుల సమస్యలపై సంఘాలకు పూర్తి అవగాహన ఉంటుంది. వీటిని అధికారుల దృష్టికి తీసుకుని వెళతారు. సాగు నీటి సమస్య, మురుగు నీటి సమస్యలను పరిష్కరించుకుంటారు. వైసీపీ హయాంలో అలాంటి సంఘాలు లేకపోవడంతో సాగులో చాలా ఇబ్బందులు పడ్డారు. మళ్లీ సంఘాల ఏర్పాటుతో రైతుల సమస్యలకు చెక్ పడినట్లే.

- పొత్తూరి రామరాజు, ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్

సంఘాల్లేక అస్తవ్యస్తం



రైతులే నీటి సంఘంలో ఉంటారు కనుక సాగులో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారు. అలాంటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం తీసేసింది. దీనివల్ల ఈ రోజు ప్రధాన రహదారుల పక్కనే వున్న పొలాలు బీడువారాయి. ఎకరానికి 50 బస్తాలు పండే భూములకు కాల్వలు సరిలేక రైతులు సాగును వదిలేయడంతో సాగు అస్తవ్యస్తమైంది.

- కోళ్ళ సీతారామయ్య, చిన అమిరం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు

సంఘాలు.. విధులు

- నీటి సంఘం ఒక గ్రామం ఆయకట్టును బట్టి రెండు, మూడు గ్రామాలు కలిసి ఒక సంఘంగా ఏర్పడుతుంది. ఇలా జిల్లాలో 112 నీటి సంఘాలు ఉంటాయి. వీటి పరిధిలోని రైతులంతా ఆయా సంఘాలకు అధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని, సభ్యులను ఎన్నుకుంటారు.
- నీటి సంఘాల కార్యవర్గాలన్నీ నీటి పంపిణీ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులను ఎన్నుకుంటారు.
- నీటి పంపిణీ కమిటీ కార్యవర్గాలు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను, వైస్ ఛైర్మన్ ఎన్నుకుంటారు.
- సాగునీటి సంఘాలన్నీ తమ పరిధిలోని సాగు నీరు, మురుగు నీటి కాల్వల సమస్యలను గుర్తించి.. నీటి పంపిణీ కమిటీలకు సమాచారాన్ని ఇస్తుంది. తమ పరిధిలోని సంఘాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా పంపిణీ కమిటీలు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దృష్టికి తీసుకుని వెళ్లి వాటిని పరిష్కరిస్తారు.

తుప్పు ప్రయాణం!

- ఈ పంటును పట్టించుకోలేదో.. రూ.35 లక్షలు గోదాట్లోకే..
- లక్షల మందిని ఒడ్డుకు చేర్చి.. నేడు నిరుపయోగంగా..



నరసాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నరసాపురం వశిష్ట గోదావరిలో తుప్పు పడుతూ కనిపిస్తున్న.. ఈ పంటు ఖరీదు అక్షరాలా ముప్పయ్ అయిదు లక్షలు పైమాటే. ఇది ధవళేశ్వరం నీటిపారుదల శాఖకు చెందినది. గత ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ రేవును నిర్వహించే సమయంలో అక్కడి నుంచి రప్పించారు. గత ఏడాది నుంచి ఈ ఏడాది మార్చి వరకు పాత పాటదారుడు దీనిని అద్దెకు వాడుకున్నాడు. ప్రస్తుతం రేవు నిర్వహణ కొత్త పాటదారుడి చేతిలోకి వెళ్లింది. ఆ పాటదారుడికి రెండు పంటులు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పంటును వాడటం లేదు. ఈ కారణంగా రెండు నెలల నుంచి ఇది వృథాగా గోదావరిలో నిలిచిపోయింది. నిర్వహణ కూడా లేదు. ఇటు సముద్రం కలిసే ప్రదేశం కావడంతో వశిష్ఠ గోదావరిలో ఉప్పు శాతమే ఎక్కువగా ఉంటుంది. నీరు, గాలికి, ఇటు నిర్వహణ కూడా లేకపోవడంతో పంటు శిథిలమవుతోంది. అడుగు భాగం నుంచి నీళ్లు కూడా పంటులోకి చేరుతున్నాయి. మరో రెండు నెలలు ఇలాగే వదిలిస్తే.. పంటంతా తప్పు పట్టిపోతుందని నిపుణులు చెప్పుతున్నారు. గత పుష్కరాలకు యాత్రికుల కోసం ఇరిగేషన్ శాఖ దీన్ని తయారుచేసింది. మరో రెండేళ్లలో పుష్కరాలు వస్తున్నాయి. కనీసం దీన్ని ధవళేశ్వరం ఇరిగేషన్ శాఖకు అప్పగిస్తే మరమ్మతు పనులు చేస్తారు. మండల పరిషత్ అధికారులు మాత్రం లక్షల ఖరీదు చేసే పంటును ఇలా వృథాగా వదిలేయడం చర్చనీయాంశమైంది.



'ఇక్కడ చేయి తడపనిదే రిజిస్ట్రేషన్లు జరగవు'

భీమవరం సబ్ రిజిస్ట్రార్‌పై విచారణ

భీమవరం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భీమవరం సబ్ రిజిస్ట్రార్ ప్రతాప్ రెడ్డిపై ఇటీవల అవినీతి ఆరోపణలు చేస్తూ వచ్చిన ఫిర్యాదులపై గురువారం జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. వీలునామా ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు రూ.1000 లంచం అడిగారని, ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. చేయి తడపందే సంతకాలు పెట్టడం లేదని లేఖర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు 70 రిజిస్ట్రేషన్‌లు జరగాల్సి ఉండగా పది కూడా జరగడం లేదని ఆరోపించారు. జిల్లా రిజిస్ట్రార్ వెం కటేశ్వరావు మాట్లాడుతూ దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి రిపోర్టుపై అధికారులకు పంపిస్తానన్నారు.

బిల్లులు రాక పనులకు బ్రేకులు



- వైసీపీ హయాంలో కాంట్రాక్టర్లకు మొండిచెయ్యి
- వెంటాడుతున్న బకాయిల భారం

భీమవరం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో అభివృద్ధి పడకేసింది. కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరు నెలల ముందు నుంచే బిల్లులు నిలిపివేశారు. కోట్లాది రూపాయలు పెండింగ్‌లో పెట్టారు. కాంట్రాక్టర్ల కాళ్లు అరిగేలా మునిసిపాల్టీల చుట్టూ తిరుగుతున్నారు. మునిసిపాల్టీలను నమ్ముకుని కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో బిల్లులు పేరుకుపోయాయి. ఎన్నికల ముందు హడావుడిగా పనులు చేయించారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. బిల్లులు మాత్రం మంజూరు చేయలేదు. కొందరు వైసీపీ నేతలు చక్రం తిప్పి కమీషన్లు దండుకుని కొద్దిపాటి మొత్తం ఇప్పించారు.

మునిసిపాల్టీల వారీగా బకాయిలు (రూ.కోట్లలో)

మునిసిపాల్టీ	జనరల్ ఫండ్	15వ ఫైనాన్స్	మొత్తం
భీమవరం	15.00	2.00	17.00
తణుకు	7.00	0.75	7.75
పాలకొల్లు	4.66	0.75	5.41
నరసాపురం	6.08	0.48	6.56
తాడేపల్లిగూడెం	1.72	-	1.72
	34.46	3.98	38.44

ఇప్పటికి ఇంకా రూ.38.44 కోట్ల వరకు బకాయిలు ఉంటాయనే అంచనా.

కొత్త పనులకు బ్రేక్

వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండర్లు ఖరారైనా బకాయిలు చెల్లించే వరకు కొత్త పనులు చేయకూడదని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రభుత్వం కొత్త పనులను కొద్దిరోజులు వాయిదా వేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కో సమస్యను పరిష్కరిస్తోంది. ఇప్పటికే పంచాయతీలకు నిధులు కేటాయించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పట్టణాల్లోనూ ఇదే తరహాలో మౌలిక వసతులు కల్పించాలని యోచిస్తున్నారు. పనుల నిర్వహణకు కొంత సమయం పడుతుంది.

సీఎఫ్ఎంఎస్ అవరోధం

మునిసిపాల్టీకి బిల్లుల చెల్లించటానికి సీఎఫ్ఎంఎస్ పెద్ద అవరోధంగా మారింది. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే బిల్లులు మంజూరవుతాయి. ఆస్తి, నీటి పన్నులు, ట్రాన్స్‌ఫర్ డ్యూటీల రూపంలో మునిసిపాల్టీలకు ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. ఆ నిధుల్లోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నారు. అంతవరకే బిల్లులు మంజూరవుతున్నాయి. మౌలిక వసతుల కల్పనకు బిల్లులు మంజూరు కావడం లేదు. వైసీపీ హయాంలో గత డిసెంబరు నుంచి బిల్లులు నిలిపివేసింది. దీంతో కాంట్రాక్టర్లు వత్తిడికి గురవుతున్నారు.

డీఆర్వోగా వెంకటేశ్వర్లు.. డీఈవోగా నారాయణ

- నెల్లూరు డీఆర్వోగా ఉదయభాస్కర్ బదిలీ
- తాడేపల్లిగూడెం ఆర్డీవోగా కౌతిబ్ కేసర్
- ఏలూరు జిల్లా డీఈవోగా వెంకటలక్ష్మమ్మ

భీమవరం టౌన్/రూరల్, అక్టోబరు 24: రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు కొత్త డీఈవోలను, డీఆర్వోలను, ఆర్డీవోలను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావును నెల్లూరు డీఆర్వోగా బదిలీ చేస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఆయన స్థానంలో ఎం.వెంకటేశ్వర్లును నియమించింది. ఏలూరు జిల్లా డీఆర్వో డి.పుష్పమణిని జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ.. ఆమెస్థానంలో డిప్యూటీ కలెక్టర్ వి.విశ్వేశ్వరరావును నియమించారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో భవానిశంకరిని నగరి ఆర్డీవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో రామచంద్రపురం ఆర్డీవో కౌతిబ్ కేసర్ జెనీను నియమించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్యను జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ ఆయన స్థానంలో మంగళగిరి సీసీఎల్ఏలో అసిస్టెంట్ సెక్రటరీ ఎంవీ రమణను నియమించారు.

పశ్చిమ గోదావరి జిల్లా డీఈవోగా రాజమహేంద్రవరం డీవైఈవో ఈ.నారాయణను నియమించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ డీఈవోగా ఆర్‌జేడీ నాగమణి కొనసాగారు. విద్యాశాఖ డైరెక్టరేట్‌లో డీడీ కేడర్‌లో సాంకేతికంగా ఉంటూ, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా డీఎస్ఈవోగా పనిచేస్తున్న వెంకటలక్ష్మమ్మను రెగ్యులర్ డీఈవోగా ఏలూరు జిల్లాకు బదిలీపై నియమించారు. ప్రస్తుత డీఈవో అబ్రహాంను డైరెక్టరేట్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. వెంకటలక్ష్మమ్మ జిల్లాల పునర్విభజనలో భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లాకు 2022 ఏప్రిల్‌లో తొలి డీఈవోగా నియమితులై, మూడు నెలలపాటు పనిచేసి వ్యక్తిగత కారణాలపై డైరెక్టరేట్‌కు వెళ్ళిపోయారు.


నారాయణ

నేటి నుంచి పశుగణన

ప్రజలు సహకరించాలి : కలెక్టర్

భీమవరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):జిల్లాలో అక్టోబరు 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి రెండో తేదీ వరకు 21వ అఖిల భారత పశుగణన సర్వేను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ పథకాల రూపకల్పనకు ఈ సమాచారం దోహదపడుతుందన్నారు. దేశంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన నిర్వహించడం జరుగుతుందన్నారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, గాడిదలు, కంచర గాడిదలు, ఒంటెలు, ఏనుగులు, కుక్కలు, కుందేళ్లు మొదలైన జంతువులు, కోళ్ళు, బాతులు, టర్కీ కోళ్ళు, ఇతర కోడి జాతి పక్షుల వివరాలను పశుగణనలో సమాచారం సేకరిస్తారన్నారు. జిల్లాలో 248 ఎన్యుమరేటర్స్, 41 సూపర్ వైజర్స్‌కు శిక్షణ ఇచ్చామన్నారు. సమాచారాన్ని సేకరించే వారికి సహకరించాలని ప్రజలను కోరారు.

డిసెంబరు 15 నాటికి పంటల బీమా

పంటల బీమా పథకానికి రైతుల పేర్లు నమోదు ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. పంటల బీమా పథకానికి రైతులే ప్రీమియం చెల్లించాలని తెలిపారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ 15 నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియ ముగించాలన్నారు.

'రీ సర్వేతో నడ్డి విరిచేశారు'


కోలమూరులో మాట్లాడుతున్న నరసరాజు

ఉండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్రోన్ల సాయంతో చేపట్టిన భూముల సర్వేలన్నీ తప్పుల తడకగా ఉన్నాయి. వాటిని రద్దు చేసి పాత వెబ్‌ల్యాండ్ ప్రకారమే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి' అని ఉండి మండలం కోలమూరు గ్రామ సచివాలయం వద్ద గురువారం భూముల రీ సర్వేపై జరిగిన గ్రామసభలో రైతులు కోరారు. రుద్రరాజు నరసరాజు, కూనపరాజు రాంబాబురాజు, సుబ్బరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులను తీవ్రంగా ఇబ్బందుల పాలు చేసింది. పొలాల వద్దకు వెళ్లకుండా కార్యాలయాల్లో కూర్చుని డ్రోన్ల సాయంతో మొక్కుబడిగా సర్వే చేసి రైతుల నడ్డివిరిచింది. ఇది ఒక్కరోజుతో కాదు.. మరో రోజు సభ పెట్టాలని కోరడంతో తహశీల్దారు నాగార్జున ఈ నెలాఖరును మరో సభ పెట్టేందుకు అంగీకరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ 31 వినతులు వచ్చినట్లు తెలిపారు.

రీ సర్వే రద్దుకు నడిపూడి రైతుల వినతి

ఆచంట/పెనుగొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):భూములకు ఎటువంటి హద్దులు నిర్ణయించకుండా రీ సర్వే చేశారని, గతంలో ఉన్న భూమికి.. రీ సర్వే చేసిన తర్వాత భూములకు తేడాలు రావడంతో రీ సర్వేను రద్దు చేయాలని కోరుతూ గురువారం పెనుగొండ మండలం నడిపూడి గ్రామసభలో రైతు సంఘం నాయకులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రీసర్వే చేయకముందు తమ భూములకు ఎలాంటి ఇబ్బందులు లేవని, రీ సర్వే అయిన తర్వాత కొనేందుకు, అమ్మేందుకు కూడా లేకుండా పోయిందని వాపోయారు. రీ సర్వేను రద్దు చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు నెక్కంటి గోపాలం, మన్నే రమేష్, మన్నే తిరుమల, వెంగళదాసు దానయ్య, నెక్కంటి సురేష్, తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ కాలమ్

ఆటల్లో ఆణిముత్యాలు



శర్వాణికి ప్రథమ బహుమతి, పతకాన్ని అందజేస్తున్న డీఈవో, తదితరులు

జాతీయస్థాయి జూడో టోర్నీకి శర్వాణీ ఎంపిక

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు ఈ నెల 21న శ్రీకాళహస్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో క్రీడా పోటీల టోర్నమెంట్ 40 కేజీల విభాగం ఈవెంట్‌లో ఏలూరు బాలగంగాధర తిలక్ ఓరియంటల్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థిని తుమరాడ శర్వాణి స్వర్ణపతకం గెలుచుకుందని స్కూలు హెచ్ఎం షఫ్రక్ తెలిపారు. నవంబరు 14 నుంచి ఒడిశాలో జరు గనున్న జాతీయస్థాయి పోటీలకు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించడానికి అర్హత సాధిం చిందని వివరించారు. శర్వాణిని గురువారం డీఈవో అబ్రహం, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అలివేలు మంగ అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు కామవరపుకోట విద్యార్థులు

కామవరపుకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 14 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయులు తూంపాటి బాబూరావు, గుడిదల శ్యామలాదేవిలు తెలిపారు. ఈనెల 23న ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన పోటీల్లో వీరు ఎంపికయ్యారు. కబడ్డీలో అండర్-14 బాలురు, బాలికలు కె.రాహుల్, కె.కావ్యశ్రీ, టి.మౌనిక, త్రోబాల్ అండర్-14లో వై.సతీష్, బి.దీపిక, కె.కుశ్వంత్, ఎం.రాకేష్, అండర్-14 బాలికల విభాగంలో కె.కావ్యశ్రీ, ఆర్.మహాలక్ష్మి, ఎన్.శ్రీవల్లి, అండర్-17 విభాగంలో ఎం.ప్రవీణ్‌కుమార్, రాజేష్, అండర్-17 బాలికల విభాగంలో జి.నిస్సీ మహిమ కుమారిలు ఎంపికైనట్టు వివరించారు. శిక్షణ ఇచ్చిన పీడీలను హెచ్ఎం పి.గసబాబు, ఉపాధ్యాయులు సత్కరించారు.

కబడ్డీ పోటీలకు నాగబాబు



కొయ్యలగూడెం, అక్టోబరు 24: రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు అండర్ -17 విభాగంలో కొయ్యలగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి పీ.నాగబాబు ఎంపికయ్యాడు. ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్‌లో ఎంపికైనట్లు హెచ్ఎం సుజాత తెలిపారు.





ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో బుధవాస్..కొప్పాక హైస్కూల్‌లో విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

త్రోబాల్ పోటీలకు పెదవేగి మండల విద్యార్థులు

పెదవేగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు పెదవేగి మండలం రామ శింగవరం, కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 23వ తేదీ బుధవారం ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో 14 ఏళ్ళ విభాగంలో రామశింగవరం హైస్కూల్‌కు చెందిన దిలీప్, కె.రాజశ్రీ, 17 ఏళ్ల విభాగంలో సీహెచ్ దివ్యశ్రీ, పి.వంశీసాయి, పి.లక్ష్మీపావని ఎంపి కయ్యారు. కొప్పాక హైస్కూల్ నుంచి 14 ఏళ్ల విభాగంలో కె.భువ నేశ్వరి, పి.నాగదీప్తి, బాల మణికంఠ, జే.వెంకట్, జే.ధనుష్, 17 ఏళ్ల విభాగంలో పి.గౌరీదేవి, లక్ష్మీశరణ్య, తరుణ్ శ్రీరామ్, ఎస్.అభిషేక్, ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఎంఈవో బుధవాస్, రామశింగవరం, కొప్పాక హైస్కూల్ హెచ్ఎంలు టీవీ.పద్మావతి, ఆర్.శైలజ, పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం ప్రసాదరావు, సర్పంచ్ గోపి

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు కైకరం విద్యార్థులు

ఉంగుటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్టు హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. అండర్-17 మూడు కి.మీ పరుగులో ఎం.అంజనేయస్వామి జిల్లా ప్రథమస్థానం, 1500 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించాడు. షాట్‌పుట్‌లో అండర్ -17 బాలికల విభాగంలో మేరీ ద్వితీయస్థానం, అండర్-14 బాలుర విభాగంలో ఏ.సుభాష్ ప్రథమ, 200 మీటర్లలో కే.మనోజ్ ప్రథమ, కే.నవీన్ కుమార్ 100 మీటర్ల పరుగులో తృతీయ, దేవకీ ప్రియాంక హైజంప్‌లో ద్వితీయస్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కైకరంలో అండర్-14 అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు హెచ్ఎం తెలిపారు. పీడీలు పాపాయమ్మ, నాగసుధ, విద్యార్థులను సర్పంచ్ సలగాల గోపి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, తదితరులు అభినందించారు.

29 నుంచి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు ఎంపికలు

ఏలూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రక్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29 నుంచి 30వ తేదీవరకు ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్, 30న హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్ పోటీలకు స్త్రీ, పురుషులకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు నవంబరు 6 నుంచి 9 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారు జాతీయస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆయా క్రీడాంశాల్లో పాల్గొనే సివిల్ సర్వీస్ ఉద్యోగులకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ ఐడీప్రూఫ్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సీఎఫ్ఎంఎస్‌తో ఏఎస్సార్ స్టేడియంలో ఈనెల 28న సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమాచారానికి 98663 17326 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

కైకలూరు (ముదినేపల్లి), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల విద్యార్థుల తైక్వాండో ఆటల పోటీలను గురువారం కైకలూరులోని ప్రభుత్వ వైవీఎన్నార్ డిగ్రీ కళాశాలలో వైస్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉదయ ప్రకాశరావు ప్రారం భిం చారు. వివిధ కళాశాలలకు చెందిన 60 మంది పాల్గొన్నారు. విజేతలైన క్రీడాకారులు వచ్చే నెల ఆరు నుంచి అమృతసర్‌లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల



పోటీల్లో పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శివనాగరాజు తెలిపారు.

ఇళ్లపై సోలార్ వెలుగులు



ఏలూరులో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

నెల బిల్లు 138 రూపాయలే

ఏలూరు శనివారపు పేటకు చెందిన సుజాత సూర్యఘర్ పథకంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్నారు. గతంలో నెలవారీ విద్యుత్ బిల్లు రూ. 2 వేల వరకు వచ్చేది. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్న తర్వాత రూ.138 బిల్లు వచ్చింది. వచ్చే నెలలో అసలు బిల్లు వచ్చే అవకాశం ఉండదు. ఎందుకంటే మిగులు విద్యుత్ విక్రయించడం ద్వారా విద్యుత్ శాఖ నుంచి సొమ్ములు వస్తాయి. 3 కిలోవాట్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. రూ.2 లక్షలు ఖర్చు అయింది. దీనికి బ్యాంక్ లోన్ వచ్చింది. రూ.78 వేలు సబ్సిడీ వచ్చింది. మిగిలిన సొమ్ము ఈఎంఐ ద్వారా చెల్లించవచ్చు. మిగులు విద్యుత్‌కు సంబంధించి విద్యుత్ శాఖ సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని సుజాత వివరించారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహం

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన

ఉమ్మడి పశ్చిమలో 75,860 కనెక్షన్లు ఏర్పాటు లక్ష్యం

ఇళ్లపై రూఫ్ టాప్ ప్యానెళ్ల ఏర్పాటు

నిరంతర సరఫరా..తక్కువ బిల్లులు

అదనపు విద్యుత్‌తో ఆదాయం



ఏలూరుసిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా విద్యుత్ కాంతులు వెదజల్ల నున్నాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనకు శ్రీకారం చుట్టింది. ఇంటి పైభాగంలో సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించు కోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించి విక్రయించుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొంద వచ్చు. నిరంతర విద్యుత్‌తో పాటు అంతరాయాలు, లోఓల్టేజి, బిల్లుల సమస్యలకు చెక్ పెట్టే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వం సబ్సిడీ కూడా అందించటంతో ఈ పథకానికి అనూహ్య స్పందన లభిస్తోందని చెబుతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, రైల్వేగేట్లు, డివైడర్లు, అపార్ట్‌మెంట్లు వద్ద సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 75,860 సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1039 మంది వినియోగ దారులు సోలార్ కనెక్షన్లు కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 425 కనెక్షన్లు పూర్తయ్యాయి.

సామర్థ్యం	ఉత్పత్తయ్యే యూనిట్లు	ప్రస్తుత బిల్లు	వచ్చే బిల్లు (సుమారుగా)	ఏడాదికి ఆదా	ప్రభుత్వ రాయితీ
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.1,000	రూ. 338	రూ.8,000	రూ. 30,000
2 కిలోవాట్లకు	240 యూనిట్లు	రూ.2,000	రూ. 333	రూ.20,000	రూ. 60,000
3 కిలోవాట్స్‌కు	360 యూనిట్లు	రూ.3,000	రూ. 293	రూ.32,400	రూ. 78,000

ప్యానెల్స్..నెట్ మీటర్ ఏర్పాటు ఇలా

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తారు. భవనం పైభాగంలో వంద చదరపు అడుగుల స్థలంలో ప్యానెల్ అమర్చుతారు. ప్రస్తుతం వినియోగించే విద్యుత్ మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేసి దీని ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగాన్ని లెక్కిస్తారు. వినియోగాన్ని మించి ఉత్పత్తయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అను సంధానం చేస్తారు. అదనపు విద్యుత్‌కు విద్యుత్ శాఖ ఆదాయం అందిస్తుంది. సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి 6, 7 సంవత్సరాల్లో తిరిగి వచ్చే అవకాశాలున్నాయి. ప్యానెల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తారు. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ రూఫ్ టాప్ కెపాసిటీ విద్యుత్ ఉత్పత్తికి 3 నుంచి 4 ప్యానెల్స్ ఉపయోగిస్తారు.

దరఖాస్తు ఇలా ?

ఈ పథకం పొందాలంటే గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు లోపు ఉండాలి. ఇది గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ పథకం కోసం మొబైల్‌లో సూర్యఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగ దారుని వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల విద్యుత్ బిల్లులు కాపీలను జతచేసి ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ రుసుం కిలోవాట్ ఆధారంగా చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి. కిలోవాట్స్‌ను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు. మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. వినియోగదారులు వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం వల్ల గృహ వినియోగ దారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1912లో సంప్రదించవచ్చు.

ఇప్పటివరకు 1039 మంది రిజిస్ట్రేషన్



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం 1039 మంది ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో 425 కనెక్షన్లు ఏర్పాటు చేశారు. భీమవరం విద్యుత్ డివిజన్‌లో 61, ఏలూరు 108 , జంగారెడ్డిగూడెం 17, నరసాపురం 55, నిడదవోలు 90, తాడేపల్లిగూడెం విద్యుత్ డివిజన్‌లో 94 మంది ఇన్‌స్టాల్ చేసుకున్నారు. మిగిలిన దరఖాస్తులకు సంబంధించి సోలార్ కనెక్షన్లు అప్రూవల్ పూర్తయినా గ్రౌండింగ్, ఇన్‌స్టలేషన్ స్టేజ్‌లో ఉన్నాయి. వినియోగదారులు ముందుకు వస్తే జిల్లా వ్యాప్తంగా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయటానికి అవకాశం ఏర్పడుతుంది.

- సాల్మన్ రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, ఏలూరు



క చిత్రం ప్రమోషన్ విడుదల చేస్తున్న హీరో కిరణ్ అబ్బవరం

భీమవరంలో క చిత్రం ప్రమోషన్

భీమవరం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమవరంతో ఎంతో అనుబంధం ఉందని, ఇప్పటికి నాలుగుసార్లు భీమవరం వచ్చానని తన మొదటి షార్ట్ ఫిలిం 'ఓ మనసా ఇటు రావే' భీమవరంలోనే చేశామని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. 'క' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా భీమవరం నాయుడు గారి కుండ బిర్యానీలో కిరణ్ గురువారం సందడి చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ కళ్యాణ మండపం, సంక్రాంతి వేడుకలకు ఈ ప్రాంతానికి వచ్చానని, మీరు చూపించే ఆదరణ ఎప్పటికి మరవలేనన్నారు. ఈనెల 31న చిత్రం విడుదలవుతుందన్నారు.1977 నాటి అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని చేశామని గొప్ప విజయం అందిస్తారని కోరుకుంటు న్నామన్నారు. ఈ చిత్రాన్ని చూసి ఆ టికెట్ రాష్ట్రంలోని నాయుడు గారి కుండ బిర్యానీ 36 బ్రాంచ్‌ల్లో ఎక్కడ చూపించినా రాయి తీపై ఫుడ్ అందిస్తారన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు

నెరవేరనున్న దశాబ్దాల కల

ఏలూరులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శ్రీకారం



తంగెళ్లమూడిలో మురుగునీటి శుద్ధి కేంద్రం

ఏలూరు టూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) ::ఏలూరు నగర వాసులకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ దశా బ్దాల కల. ఈ స్వప్నాన్ని కూటమి ప్రభుత్వం త్వరలో నిజం చేయబోతుంది. ఎన్నో ప్రభు త్వాలు వచ్చినా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు శ్రీకారం చుట్టలేదు. 2014లో అధి కారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి పూనుకుంది. అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో రూ.37.48 కోట్లు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మంజూరు చేసింది. చింతలపూడి సబ్ బేసిన్ ప్రాంతంలో తంగెళ్ళమూడిలో 50 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటుకు పనులు ప్రారం భించారు. ఈ ఆరు డివిజన్లలో ఉత్పన్న మయ్యే సెప్టిక్ ట్యాంకుల్లో ఉన్న వ్యర్థాన్ని శుద్ధి చేసే ప్లాంట్లు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఆరు డివిజన్స్‌లోని 21 కిలోమీటర్ల దూరంలో భూమిలో పైపులైన్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాబోయే 30 సంవత్సరాల్లో ప్రజల అవసరాలు తీర్చే విధంగా అండర్ గ్రౌడ్ డ్రైనేజీ డిజైన్ చేశారు. ఈ శుద్ధి కేంద్రాన్ని పదేళ్ళ తరువాత పెంచు కునేలాగా డిజైన్ చేశారు. అమృత్ పథకంలో యూజీడీ నిర్మాణానికి 38.48 కోట్లు మంజూరు చేశారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం వాట 10.05 కోట్లు రాష్ట్రం వాటా 3.94 కోట్లు, నగరపాలక సంస్థ వాటా



14.18 కోట్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాటా 9.31 కోట్లుగా నిర్ణయిం చారు. 2018 సంవత్సరంలో అనాటి టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. ఆయా డివిజన్స్‌లో పైపులైన్ల పనులు ప్రారం భించారు. 1వ డివిజన్ పాత డంపింగ్ యార్డు వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ పనులు మధ్యలో ఉండగానే ఎన్నికలొచ్చాయి. ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులన్నీ ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెను వెంటనే యూజీడీ పనులు ప్రారంభించింది. ప్రభుత్వం వచ్చిన 100 రోజుల లోపే డంపింగ్‌యార్డు వద్ద 50 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు పూర్తి చేసింది. ట్రయల్ రన్‌ను ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించారు.


వన్‌టౌన్‌లో పనులకు డీపీఆర్

వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూ.112 కోట్లతో డీపీఆర్ తయారు చేశారు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఇంజ నీరింగ్ ఇన్ చీఫ్‌తో టెక్ని కల్ సేంక్షన్ కోసం పంపించారు. త్వరలో అనుమతి వచ్చే అవకాశం ఉంది. అనుమతి లభించిన తరువాత టెండర్ల పనులు ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా పోణంగిలో 15 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తారు. 7వ డివిజన్ నుంచి 17వ డివిజన్ వరకు 38 కిలోమీటర్ల మేర 3 పైపు లైన్లు వేస్తారు. లక్ష్మమ్మకొనేరు, వెంకటాపురంలో రెండు పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. ఈ పంపింగ్ స్టేషన్ వద్దకు వచ్చిన మురుగు నీటిని శుద్ధి చేసి వెంకన్న చెరువుకు పంపి స్తారు. దీనిలో భాగంగా పది కిలోమీటర్లలో ఉన్న పాత పైపులైన్లను మరమ్మతులు, పూడిక తీస్తారు. 1980లో వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిం చారు. దానికి సంబంధించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం పైపులైన్లు పూడుకు పోయాయి. దీంతో నూతన టెక్నాలజీతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

ఫొటో ఫోకస్

డేంజరస్

ఈ మలుపుల్లో జర.. జాగ్రత్త



రహదారులపై ప్రమాదకరమైన మలుపులు మృత్యు మార్గాలుగా మారాయి..ఎదురుగా ఎవరొస్తున్నారో తెలియకపోతే యాక్సిడెంట్ అవడం ఖాయం.. ఇలాంటి మలుపుల్లో జనం బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి. - పెంటపాడు



తాడేపల్లిగూడెం- భీమవరం వెళ్లే కేఎస్ రహదారిలో ముదునూరు సమీపంలో ప్రమాదకర మలుపులు

☛ తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్ళే కే.ఎస్ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారిలో పెంటపాడు దాటిన తరువాత ముదునూరు గ్రామం మధ్యలో రహదారిపై ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ రహదారికి రెండు పక్కలా దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రహదారి మూసుకుపోయి ఎదురు వచ్చే వాహనాలు అసలు కనిపించవు.. దీంతో ఇక్కడ తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్చరిక బోర్డులు లేవు.. లైట్లు కూడా లేక పోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఈ మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో పలువురు మృతి చెందగా ఎంతో మంది గాయాల పాలయ్యారు.

☛ పెంటపాడు నుంచి కే.పెంటపాడు వెళ్లే రోడ్డులో వెలమసంఘం వద్ద ప్రమాదకర మలుపు ఉంది. ఇక్కడా ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఉండవు. ఈ రహదారికి అనుకుని అన్నీ ఇళ్ళే ఉంటాయి. దీంతో వాహనాలు వచ్చే వేగానికి పిల్లలకు ఎటు వంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రహదారికి కే.పెంటపాడు సెంటర్ వద్ద భారీ మలుపు ఉంది. ఈ మలుపు దగ్గర ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కానీ నేటికి ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడ్ బ్రేకర్లు గానీ లేవు..అధికారులు స్పందించి ప్రమాదకర మలుపులు ఉన్న చోట్ల అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కే.పెంటపాడు సెంటర్ వద్ద ...



వెలమసంఘం భవనం వద్ద కే.పెంటపాడు వెళ్లే రోడ్డులో..

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఘాట్‌లు తూట్లు

కార్తీక మాసం సమీపిస్తున్నది. కాని ఉమ్మడి జిల్లాలో పుష్కరఘాట్‌ల పరిస్థితి అధ్వానంగా ఉన్నది. గోదావరి, కాల్వల్లో భక్తులు పుణ్య స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేయలేదు. గతంలో నిర్మించిన పుష్కరఘాట్‌లే దర్శనమిస్తున్నాయి. ఈ ఘాట్‌లపై కొన్ని చోట్ల బురద పేరుకుపోయింది. మరికొన్ని ధ్వంసమయ్యాయి. అనేక రేవుల్లో బారికేట్లు ఏర్పాటు చేయలేదు. పుణ్యస్నానాలు చేసిన తర్వాత భక్తులు నీటిలో కార్తీక దీపాలు వదులుతుంటారు. నీటి లోతు తెలియని భక్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నది. రేవుల వద్ద భక్తులు దుస్తులు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు చేయలేదు. రేవుల్లో గాజుముక్కలు, నిమజ్జనాల సందర్భంగా బొమ్మల్ని గోదావరిలో కలిపారు. వీటికి సంబంధించిన ఇనుప ఊచలు కూడా తీయాల్సి ఉంది. ఇక చీకటి పడితే రేవుల్లో అంధకారమే. దీని వల్ల భక్తులు తెల్లవారుజామున ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌ల వద్ద అసౌకర్యాలపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఏర్పాట్లు చేయవలసి ఉన్నది.

పోలవరం నుంచి గూటాల వరకూ గతంలో ఇసుక తిన్నెలతో స్నానాల రేవులు ఉండడం వలన ఎలాంటి ప్రమాదాలు లేకుండా నిర్భయంగా భక్తులు కార్తీక మాస పుణ్య స్నానాలు , నిత్య స్నానాలు చేసేవారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత స్పిల్వే నుంచి విడుదలవుతున్న జలాల తాకిడికి గోదావరి నది దిశ మారి పోలవరం నుంచి గూటాల వరకు రేవులు ప్రమాదకరంగా లోతుగా మారిపోయాయి. కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల రేవులలో మాత్రమే నదిలోకి మెట్లతో కూడిన రేవులు ఉన్నాయి. అయితే బారికేడ్‌లు, వెదురు తడికలు ఏర్పాటు చేయవలసి ఉన్నది. పుణ్య స్నానాలు చేసుకునే ప్రాంతాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, స్నానాల గదులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. పట్టిసీమ ఫెర్రీ రేవునే పుణ్యస్నానాల కోసం ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ నదిలో బారికేడ్‌లు, బట్టలు మార్చుకునే గదులు, రేవులో ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేయించి సిద్ధం చేయాలని భక్తులు కోరుతున్నారు.

- పోలవరం



పట్టిసీమ ఫెర్రీరేవు



ఆటోల వెనుక స్నానాల ఘాట్

గణపవరంలోని వెంకయ్యవయ్యేరు స్నానాల ఘాట్ అపరిశుభ్రంగాను చెత్తాచెదారంతోనూ, దుర్గంధంతోనూ కొట్టుమిట్టాడుతున్నాయి. స్నానాల ఘాట్ పరిసర గృహాల వారు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం కూడా ఈ రేవులోనే పారబోస్తున్నారు. ఈ ఘాట్ వద్ద ఆటోలు, వ్యాన్‌లు నిలుపుదల చేస్తుంటారు. వాహనాల స్టాండ్‌గా మారిపోయింది.

- గణపవరం



బురద ఘాట్‌లు

కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంలలో రేవులు ఉన్నాయి. గోదావరి వరదల వల్ల మట్టితో పూడుకుపోయాయి. ప్రధానంగా పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద ఉన్న రేవులో పుష్కర సమయంతో పాటు ఆలయానికి వచ్చే భక్తులు నిత్యం రేవులో గోదావరి స్నానాలు చేస్తారు. ఇక్కడ కూడా రేవు పూర్తిగా మట్టితో కప్పబడి ఉంది.

- ఆచంట

అపరిశుభ్రం

నరసాపురం కాలువలో భక్తులు స్నానాలు చేయడానికి సుమారుగా 25 రేవుల వరకూ ఉన్నాయి. రేవులను శుభ్రం చేసే పనులు మునిసిపల్ సిబ్బంది చేపట్టినప్పటికీ ఇంకా అనేక ఘాట్‌ల వద్ద అపరిశుభ్రత నెలకొన్నది. కార్తీక మాసంలో ప్రతి రోజు రేవుల వద్ద బ్లీచింగ్ చల్లవలసి ఉన్నది.

- పాలకొల్లు అర్బన్





తుప్పు పట్టిన షవర్‌బాత్‌లు

వశిష్ఠ గోదావరికి వరదలు తాకడంతో మెట్లపై మట్టి, బురద పేరుకుపోయింది. వలంధర్, కొండాలమ్మ, అమరేశ్వర, లక్ష్మణేశ్వరం రేవుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. షవర్‌బాత్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రేవుల్లో ప్రమాద హెచ్చరిక చుట్టూ ఏర్పాటు చేసిన ఫిన్సింగ్ కొట్టుకుపోయింది.

- నరసాపురం

మజ్జిగ జీవామృతంతో అధిక దిగుబడులు



ఆవుపేడతో చేసిన పిడకలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆచంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో భాగంగా సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కోసం వ్యవసాయ అధికారులు ఆచంటలో రైతు చిలుకూరి విశ్వేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. మజ్జిగ జీవామృతం పంచగవ్యాలను వాడుతూ అధిక దిగుబడులు ఎలా సాధిస్తున్నారు అనే విషయాన్ని రైతు వివరించడం జరిగింది. ఐదు సంవత్సరాలుగా రైతు విశ్వేశ్వర రావు పుల్ల మజ్జిగ పై వ్యవసాయాన్ని చేస్తున్నాడు. దీనికి ఎటువంటి ఎరువు గాని పురుగు మందులు గాని వాడకుండానే ఇలా వ్యవసాయం చేస్తున్నాడు. దీంతో శాస్త్రవేత్తలు కూడా రైతు చేస్తున్న విధానాన్ని అభినందించారు. అలాగే ఆవు పిడక (కచ్చిక) బూడిదను ప్రతి రోజూ ఉదయం పళ్ల తోముకుంటే పళ్ళ సమస్యలు ఉండవని, ఆవు పేడతో పిడకలు కూడా చేస్తున్నట్లు రైతు విశ్వేశ్వరరావు, సత్యవతి దంపతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎండీ కృష్ణాజీ, సినీయర్ సైంటిస్టు వై. సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందించడమే లక్ష్యం



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పాలసీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వలసపల్లి, యల్లాపురంల్లో గురువారం ఉచిత ఇసుక రీచ్‌లను ఆయన ప్రారంభించారు. ఇప్పుడున్న రీచ్‌లతోపాటు మరో 108 రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దూరాన్ని బట్టి ధర వసూలు చేయాలని, ఇష్టారాజ్యంగా వసూలు చేసేందుకు విలులేదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ట్రాక్టర్ల యాజమానులు సమావేశమై ధరల వివరాలను ఆర్డీవోకు అందజేయాలన్నారు. నూజివీడు ఆర్డీవో వాణి, సర్పంచ్‌లు చలసాని దామోదరరావు, మొక్కపాటి మురళీ కృష్ణ, ఎంపీడీవో జి.రాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తమశర్మ, టీడీపీ మండల అధ్యక్షులు దేవినేని ధలరాం, గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించండి

దేశ వ్యాప్తంగా 21వ పశుగణన అక్టోబర్ 25 నుంచి 2025, ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందని, మంత్రి పార్థసారథి తెలిపారు. పశు గణనకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, బ్రోచర్లు, స్టిక్కర్లు, మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పశుగణన పూర్తి అయితే ఇంటి ముందు తలుపునకు కుడి ఎగువ మూలలో స్టిక్కర్ అంటిస్తారన్నారు.



ఎం నాగులపల్లి వద్ద బైక్‌పై వెళ్తున్న ఓ జంటకు హెల్మెట్‌లు అందజేస్తున్న ఎస్పీ శివకిషోర్

రోడ్డు ప్రమాద అనర్థాలపై అవగాహన

వాహనదారులకు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ కౌన్సెలింగ్

ద్వారకాతిరుమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాహనదారులు గమ్యానికి చేరడంలో పది నిమిషాలు లేటైనా పర్వాలేదు కానీ... ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే ఆ కుటుంబానికి ఎనలేని నష్టం వాటిల్లుతుందని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు ఎస్పీ ఓ వినూత్న కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో మండలంలోని ఎం నాగులపల్లి అడ్డరోడ్డు వద్ద గతంలో ప్రమాదానికి గురైన బైక్‌ను చూపుతూ రోడ్డుప్రమాదం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే హెల్మెట్ వాడకం వల్ల వాహనదారులకు జరిగే లాభాలను వివరించారు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనంపై కుటుంబంతో హెల్మెట్ లేకుండా వెళ్తున్న వ్యక్తిని ఆపి అతనికి అతని భార్యకు ఎస్పీ చేతుల మీదుగా హెల్మెట్‌ను అందచేసి కౌన్సెలింగ్ ఇచ్చారు.

క్రైమ్ కార్నర్

యువకుడి అదృశ్యం

చెరువులో గాలింపు చర్యలు

ద్వారకా తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జి కొత్తపల్లిలో ఓ యువకుడి అదృశ్యం కలకలాన్ని రేపింది. కామవరపుకోట మండలం ఆడమిల్లికి చెందిన ఎస్ వినోద్‌కుమార్ (28)కూలి పనులు చేసుకుని కుటుంబ పోషణ చేస్తున్నాడు. ఈక్రమంలో నాలుగునెలల క్రితం అత్తారిల్లైన జి కొత్తపల్లి వచ్చి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి కూలి డబ్బులు తీసుకొస్తానని ఇంటిలో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వారు పోలీసులకు పిర్యాదు చేశారు. చెరువు గట్టుపై యువకుడి చెప్పులు, ద్విచక్రవాహనం, ఫోన్ ఉండటంలో భీమడోలు సీఐ విల్సన్, పోలీసులు గురువారం రాత్రి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ వ్యక్తి చెరువులో దూకిఉండవచ్చని అనుమానంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు.

అక్రమ రేషన్ బియ్యం సీజ్

దోసపాడు గ్రామ పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యం కలిగిన వారిపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో అక్రమం ఉన్న బియ్యం బస్తాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

అనధికార మద్యం పట్టివేత

చింతలపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనధికార మద్యం సీసాలు కలిగిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. తడికలపూడి, కళ్ళచెరువు, కె.ఎస్.రామవరం, జీలకర్రగూడెం గ్రామాల్లో గస్తీలో 52 మద్యం బాటిళ్ళు నలుగురు వ్యక్తుల నుంచి దొరికాయని, విడివిడి కేసుల్లో వీరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు అబ్దుల్‌ఖలీల్, ఆర్.వి.ఎల్.నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

పెంటపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు పెంటపాడు ఎస్‌ఐ స్వామి తెలిపారు. మే నెల 5వ తేదీన పెంటపాడు గ్రామానికి చెందిన కేదారి అయప్ప ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి బీరువాలోని బంగారం, వెండి వస్తువులు అపహరించుకు పోయాడు. గురువారం పెంటపాడులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు అనుమానాస్పద స్థితిలో భీమవరానికి చెందిన జువ్వల అశోక్‌కుమార్ అనే వ్యక్తి తారసపడ్డాడు. దీంతో ఇతన్ని స్టేషన్‌కు తరలించి విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. ఇతని వద్ద నుంచి రూ.80 వేలు విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు తరలించగా, కోర్టు ఇతనికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ముగ్గురు మోటారు సైకిళ్ళ దొంగలు అరెస్టు

19 మోటారు సైకిళ్ళు స్వాధీనం

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్ళు అపహరిస్తున్న ముగ్గురు వ్యక్తులను నూజివీడు టౌన్ పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. నూజివీడులోని రాజీవ్ సర్కిల్ వద్ద రామన్నగూడెం రోడ్డువైపు నుంచి ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ పై అనుమానాస్పదంగా వస్తూ ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్ళను అపహరించినట్లు వారు అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేశారు. నిందితులు తెలంగాణ రాష్ట్రం వేంసూరి మండలం కల్లూరిగూడెం గ్రామానికి చెందిన బత్తుల పవన్‌కల్యాణ్ (27), భీమిరెడ్డి సీతారామిరెడ్డి (35) దూళ్ళ కొత్తూరు గ్రామానికి చెందిన ధనికొండ రమేష్ (32)లుగా గుర్తించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొత్తం 19 మోటారు సైకిళ్ళు ఈ ముగ్గురు అపహరించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ చెప్పారు. బత్తుల పవన్‌కల్యాణ్ సత్తుపల్లి కాకతీయ డిగ్రీ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ చదివి ప్రస్తుతం హోల్డింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, భీమిరెడ్డి సీతారామిరెడ్డి 9వ తరగతి వరకు చదివి మోటారు సైకిళ్ళ మెకానిక్‌గా పనిచేస్తున్నాడని, మూడో నిందితుడైన ధనికొండ రమేష్ గత 9 నెలలుగా ఆర్ అండ్ బి కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడని, రాయుడుపాలెం గ్రామంలో బెల్టు షాపుకూడా నడుపుతున్నాడని వీరంతా చిన్ననాటి స్నేహితులు అని చెప్పారు. నేరస్తులను అరెస్టు చేయడంలో కీలకంగా విధులను నిర్వర్తించిన డీఎస్పీ ప్రసాద్, సీఐ సత్య శ్రీనివాస్‌కు, సిబ్బందికి ఎస్పీ కెపిఎస్ కిషోర్ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ ఎస్ సూర్యచంద్రరావు, డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాధవరంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మాధవరంకు చెందిన మందపల్లి సాయి కుమార్(21) చిన్న వయస్సులోనే అమ్మ చనిపోవడంతో అమ్మమ్మ వద్దే ఉంటున్నాడు. కూలిపనులు చేసుకుంటూ అమ్మమ్మకు తోడుగా ఉండేవాడు. మూడు నెలల క్రితం రాజమండ్రి దివాన్‌చెరువుకు చెందిన అమ్మాయితో వివాహం జరిపించారు. అయితే మూడు రోజుల క్రితం సాయికుమార్ అత్తవారింటికి వెళ్లి తిరిగి గురువారం సాయంత్రం తిరిగి వచ్చాడు. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం సేవించి ఇంట్లో ఫ్యాన్‌కు చున్ని కట్టి ఉరివేసుకున్నాడు. దీంతో అమ్మమ్మ నందికోళ్ల రామలక్ష్మి ఫిర్యాదు చేయడంతో రూరల్ ఏఎస్సై దుర్గారావు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

11 మంది అరెస్టు

ఆచంట, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఆచంట శివారు శేషమ్మచెరువు రోడ్డులో నక్కలకాలువగట్టు వద్ద గురువారం పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ. 24,500 నగదుతో పాటు 52 పేక ముక్కలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కట్టా వెంకట రమణ తెలిపారు.

ప్రేమను ఒప్పుకోలేదని.. వివాహితపై హత్యాయత్నం

తిరుగుడుమెట్టలో ఘటన

పరారీలో దెందులూరు యువకుడు

తాళ్లపూడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : తన ప్రేమను ఒప్పుకోలేదని ఒక ఉన్మాది వివాహితపై హత్యాయత్నానికి తెగబడ్డాడు. ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి హరినాథ్ డిగ్రీ చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా అంబేద్కర్ కోనసీమ జిల్లా కే.గంగవరం గ్రామానికి చెందిన యువతి అమ్మమ్మగారి ఊరైన దెందులూరు వెళ్లింది. ఆ యువతిని చూసిన హరినాథ్ ప్రేమిస్తున్నానని వెంటపడే వాడు. అందుకు ఆమె ససేమిరా అంది. మా బంధువుల అబ్బాయితో పెళ్లి కుదిరింది వదిలేయమని వేడుకుంది.. అయినా పట్టించుకోకుండా వెంటపడుతూనే ఉండేవాడు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట తూర్పు గోదావరి జిల్లా తిరుగుడుమెట్టకు చెందిన బంధువుల అబ్బాయితో వివాహమైంది. అయినా ఆమెను వదల్లేదు. ఫోన్ చేసి వేధిస్తూనే ఉన్నాడు. ఆమె స్పందించక పోవడంతో ఉన్మాదిగా మారి గురువారం ఉదయం తిరుగుడుమెట్ట గ్రామం చేరుకున్నాడు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుందాం రమ్మని పట్టుబట్టాడు.. అయినా మాటవినలేదు.. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది.. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుండగానే తన వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె పొట్టభాగంలో పొడిచి పారిపోయాడు. దీంతో ఆమె గాయాలపాలైంది. స్థానికులు వెంటనే కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి బాగానే ఉన్నట్టు తెలిసింది.ఈ ఘటనపై తాళ్లపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్మాది పరారీలో ఉన్నట్టు పోలీసులు చెప్పారు.

మామను నోటితో కొరికి గాయపర్చిన అల్లుడు

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మామపై అల్లుడు దాడి చేసి శరీరంపై పలు చోట్ల కొరికి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. దేవపూడికి చెందిన మట్లపూడి కనకారావు కుమార్తె స్టాలిన్ దేవితో పదిహేనేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన అబ్బిశెట్టి బాలాజీతో వివాహం జరిగింది. నాలుగేళ్ల కిందట భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టుకోగా వివాదం కోర్టుకు చేరగా వాయిదాలు జరుగుతున్నాయి. భార్యాభర్తలు వేర్వేరుగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న స్టాలిన్ దేవి తండ్రి కనకారావుతో అల్లుడు బాలాజీ తగాదా పడి 'నువ్వు బతికున్నంత కాలం నా భార్య నా దగ్గరకు రాదు, నిన్ను చంపేస్తా' అంటూ మామపై దాడికి దిగి ఎడమ చేతి వేళ్లను, కంటి నొసలను కొరికేశాడు. దీంతో కనకారావును గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేశారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. ఏపూరు గ్రామంలో అద్దె ఇంటిలో కూటా పవన్‌కుమార్ బాణసంచా నిల్వ చేశాడు. వాటి విలువ రూ.1,56,826గా ఉంటుందని తెలిపారు. నిల్వ ఉంచిన వ్యక్తిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదవేగి: ముందూరు గ్రామానికి చెందిన కొనకళ్ళ వెంకటకృష్ణ అనే దుకాణదారుడు అనుమతులు తీసుకోకుండా దీపావళి మందుగుండు సామగ్రిని తీసుకువచ్చి అక్రమంగా నిల్వ చేశాడు. దీనిపై అందిన సమాచారంతో గురువారం సాయంత్రం దుకాణంపై దాడి చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సుమారు రూ.20వేల విలువ చేసే దీపావళి మందుగుండు సామగ్రి లభించింది. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆకివీడు సెంటర్‌లో దొంగల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

ప్రయాణికులూ జర జాగ్రత్త !

దొంగలు మనతో ప్రయాణిస్తూ ఉంటారు. మన విలువైన వస్తువులపై కన్నేస్తారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఆకివీడులో చోరీలకు పాల్పడుతున్న 48 మంది దొంగల ఫొటోలతో సెంటర్‌లో పోలీసులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫొటోలలో ఉన్న దొంగలు కన్పిస్తే అప్రమత్తంగా ఉండాలి, పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఆకివీడు

రెండు తలల పాము



ద్వారకాతిరుమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల వసంత్‌నగర్ కాలనీలో రెండు తలల పాము కన్పించింది. అరుదుగా కన్పించే ఈ పాము గురువారం హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన కుర్రి అంజిబాబు అనే రైతు తన పొలంలో గేదెలకు పాలు తీసేందుకు గురువారం రాత్రి వెళ్లాడు. ఇదే సమయంలో అక్కడ ఈ రెండు తలల పాము ప్రత్యక్షమవడంతో ముందు భయపడ్డారు. అయితే ఇది విషరహితం కావడంతో దానిని స్థానికుల సహాయంతో ఖాళీ ప్రదేశంలో వదిలి వేశారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలి

▸ జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, సివిల్ సప్లై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. రైతు సహాయక కేంద్రాల్లో 25 శాతం గన్ని బ్యాగులను భద్రపరుచుకోవాలని సూచించారు. వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లను రైస్ మిల్లులు వద్ద వెహికల్ మానిటరింగ్ అధికారులుగా నియమించామన్నారు. వీరు కస్టోడియన్ అధికారుల సహకారంతో రైస్ మిల్లుల వద్దకు ధాన్యం దిగుమతికి వచ్చిన వాహనాలను మూడు గంటల లోపులో దిగుమతి చేయించే బాధ్యతను తీసుకుంటారన్నారు. డీఆర్‌వో జె.ఉదయభాస్కరరావు, ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వై.భవానీశంకరి, సివిల్ సప్లైస్ డీఎం టి.శివరామకృష్ణ, డీఎస్‌వో ఎన్.సరోజ, ఏఎస్‌వో శివశంకర్ జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, సివిల్‌సప్లై డీటీలు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

అరుంధతీ పేటలో వైద్య శిబిరాలు నిర్వహించాలి

భీమవరంఅర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మోగల్లు అరుంధతీ పేటలో విష జ్వరాలు పెరుగుతున్నందున తక్షణమే వైద్య శిబిరాలు నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావుకు కేవీపీఎస్ బృందం వినతిపత్రం అందించింది. ఆయన మాట్లాడుతూ మోగల్లు గ్రామ అరుంధతీ దళిత పేటలో నెలరోజులు నుంచి విష జ్వరాలతో దళిత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్ ఉన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా : సీఐ

ఆకివీడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీఐ జగదీశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని సీసీ కెమేరాల పని తీరును ఎస్ఐ హనుమంతు నాగరాజుతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గతంలో దాతల సహకారంతో ప్రధాన సెంటర్లలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. కొన్నిచోట్ల అవి నిరుపయోగంగా మారాయని వాటిని మరమ్మతులు చేయించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేస్తామన్నారు. పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల పనితీరు పరిశీలించారు.


ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా మహిళలు

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు వద్దు

ఆకివీడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నివశించే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు పెట్టకుండా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఐద్వా మహిళలు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ బడ్డీకొట్లు, పాన్ షాపులు తదితర చోట్ల మద్యం గొలుసు దుకాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని వాటిని నివారించాలంటూ ఎక్సైజ్ సీఐ మన్నే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ బెల్టు షాపులు నివారణకు చర్యలు చేపడతామన్నారు. ఐద్వా మహిళలు డోకల లక్ష్మి, జీవీ లావణ్య, బి.కల్యాణి, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



ఆధార్ కేంద్రాల పరిశీలన

గణపవరం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : గణపవరంలోని సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును జిల్లా జీఎస్ డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్, డీఎల్‌డీఏ వై.దోసిరెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఆధార్‌క్యాంపు పరిశీలించి సూచనలు చేశారు. వేగంగా ఆధార్‌నమోదు కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివరామప్రసాద్ పాల్గొన్నారు.


అర్హులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ప్రజల ప్రాణాల కోసమే ఆక్రమణలు తొలగిస్తున్నాం

▸ ఇంకా అర్హులంటే ఇళ్ల స్థలాలిస్తాం : ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఆకివీడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలు కాపాడేందుకే కాల్వ గట్టుపై ఇళ్లను తొలగించి అర్హులకు ఇళ్ల స్థలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పట్టణ పరిధిలో ఇటీవల అయి-భీమవరం రోడ్‌లో కాల్వ గట్టుపై నివాసితుల ఇళ్లు తొలగించిన వాటిలో అర్హులు 62 మంది, ధర్మాపురం అగ్రహారంలో ఐదుగురికి గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇళ్ల పట్టాలు అందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధి, తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకే ఆక్రమణ ఇళ్లను తొలగించామని, వారికి ఇళ్ల స్థలాలు అందిస్తున్నామని, ఎవరిపై వ్యక్తిగత కక్షలు లేవన్నారు. ఇంకా అర్హులంటే అధికారుల విచారణ అనంతరం అందచేస్తామన్నారు. ఒకసారి లబ్ధిపొందితే మళ్లీ ఇళ్ల స్థలాలు ఇవ్వరని తెలిపారు. టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు, కౌన్సిలర్ బొల్లా వీరశ్వేత, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్, కట్రెడ్డి ఏడుకొండలు, హౌసింగ్ డీఈ పి.శివరామరాజు, ఏఈలు తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు రూ.లక్ష విరాళం చెక్‌ను అందించిన వెస్ట్‌బెర్రీ స్కూల్ యాజమన్యాం, విద్యార్థులు

విజయవాడ వరద బాధితులకు రూ.లక్ష విరాళం

భీమవరంటౌన్, అక్టోబరు 24 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ నాగరాణిని కలిసి వెస్ట్ బెర్రీ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు రూ.లక్ష చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మేము సైతం అంటూ వరద బాధితులకు సహాయం చేయడానికి ముందుగా రావడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. స్కూల్ డైరెక్టర్ ఎస్.మహేష్ కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.స్మిత, మిడ్ డే మీల్స్ కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు, విద్యార్థులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఉండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):ఉండి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ నిలు పుదల చేస్తున్నట్టు ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండి, పెదపుల్లేరు, చినపుల్లేరు, కలిసిపూడి, చెరుకువాడ, మహదేవ పట్నం, చిలుకూరు, వెలివర్రు, గ్రామాలతో పాటు ఇండస్ట్రియల్, ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.


మెప్మా బజారులో కొనుగోలు చేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రావు

మెప్మా బజారు ప్రారంభం

ఆకివీడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల ద్వారా పొందుతున్న రుణాలు మెప్మా మహిళల ఉపాధికి ఉపయోగపడుతున్నాయని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు అన్నారు. స్థానిక అయి-భీమవరం రోడ్‌లో ఏర్పాటు చేసిన మెప్మా బజారును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఆకాంక్షతో డ్వాక్రా సంఘాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ నాయకులు, మెప్మా సభ్యురాలు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

కాళ్ళ/ఉండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదల పాలిట పెన్నిది అని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.17,13,867 సీఎంఆర్ ఎఫ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందించారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.ఉండి మండలం గోరింతోటకు చెందిన పట్టపు రామకృష్ణకు రూ.1లక్ష 44వేల సీఎం సహాయ నిధి చెక్‌ను మాజీ ఎంపీటీసీ గొల్ల విక్టర్‌బాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి అందజేశారు. మాజీ జడ్పీటీసీ కాగిత మహంకాళి, మంతెన సాయిలచ్చిరాజు, కరిమెరక శ్రీను, పెద్దింటి బాబు తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ ఆవుకు చికిత్స



గణపవరం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా గణపవరం రోడ్డులో వాహ నం ఢీకొని ఒక ఆవు కాలు విరిగి తీవ్ర రక్తస్రా వంతో కూలబ డింది. లలిత పిరమిడ్ జ్ఞాన కేంద్ర మాస్టారు పెరుమాళ్ల మురళీకృష్ణ చొరవచూపి కొంతమంది సాయంతో ప్రథమ చికిత్స చేసి తన ఇంటి వద్దే ఆశ్రయం కల్పిం చారు. ఈ విషయమై పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డీఎం.నాయక్‌ను సంప్ర దించగా ప్రమాదాలు జరిగినప్పుడు విధిగా పంచాయతీ ద్వారా పోలీసు కేసు నమోదు చేస్తేనే వైద్యం చేయాలనే నిబంధన ఉందన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భీమవరం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలలో వ్యాసరచనలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. గురువారం సైబర్ నేరాల నివారణలో యువత పాత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజ శ్రేయస్సు, భద్రత కోసం పోలీసులు అనుసరిస్తున్న సేవలు, త్యాగాలను వివరించారు. పగలు, రేయి అనకుండా అహర్నిశలు శ్రమిస్తూ సంఘ విద్రోహ శక్తులతో పోరాడే క్రమంలో ప్రాణాలు త్యాగం చేస్తుండడం జరుగుతోందన్నారు. పోలీసులు సేవలు దైనందిన విధులు, త్యాగాల పట్ల అవగాహన చేసుకోవడం, గుర్తించడం చాలా ముఖ్యమన్నారు.

దోమలను నియంత్రించాలి

గణపవరం/పాలకోడేరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): దోమల నియంత్రణకు గంబూషియా చేప ప్రధాన పాత్రపోషిస్తుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్‌బాబు అన్నారు. గణపవరంలోని పలు ప్రాంతాల్లో నీటినిల్వలు ఉన్నప్రదేశాల్లో గంబూషియా చేపలను వదిలే కార్యక్రమం గురువారం చేపట్టారు. దోమలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పాలకోడేరు మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ.రంగనాయుడు అన్నారు. పాలకోడేరులోని గురువారం గరువుశివారులో పాడైపోయి దోమలకు ఆవాసకేంద్రంగా మారిన మారెమ్మ చెరువులో గంబూషియా చేపలను వైద్యసిబ్బంది వదిలారు. సీహెచ్‌వో ఎం.సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు

అదనపు జిల్లా న్యాయాధికారి హాస్టళ్ల సందర్శన

భీమవరం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు హాస్టళ్ల వరుస తనిఖీల్లో భాగంగా నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి న్యాయాధికారి పి.విజయదుర్గ స్థానిక బలుసుమూడిలో ఉన్న వేంకటేశ్వర బధిరుల పాఠశాలను సందర్శించారు. పిల్లలకు కంటి సమస్యలు, దంత సమస్యలు, వినికిడి సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సంస్థకు తెలియజేస్తే సంబంధిత నిపుణులతో పరీక్షలు చేయిస్తామన్నారు. అనంతరం స్థానిక ఎల్ఐసీ ఆఫీసు పక్కన ఉన్న బీసీ గవర్నమెంట్ కాలేజీ విద్యార్థినుల హాస్టల్‌ను సందర్శించి మాట్లాడారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు బైక్ సైలెన్సర్ తీసి శబ్దాలు చేసుకుంటూ హాస్టల్ మీదుగా తిరుగుతున్నారని తెలిపారు. ఒన్‌టౌన్ పోలీస్‌వారికి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలకు కావల్సిన సదుపాయాలు అడిగి తెలుసుకుని రాసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్ గదులు, వాష్ రూమ్‌లు, వంటగదిని తనిఖీ చేశారు. ప్యానల్ న్యాయవాదులు పి.అంబేద్కర్, కె.జ్యోతి, బి.లోకేశ్వరరావు, ఎన్.సుధీర్, డి.రవికిరణ్, ఎంబీ భవాని, హాస్టల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి విజయదుర్గ

వాద్వానీ ఫౌండేషన్‌తో 'ఎస్ఆర్‌కేఆర్' ఎంవోయూ

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఇన్నోవేషన్స్ నూతన ఆవిష్కరణ చేసేందుకు ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వాద్వానీ ఫౌండేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. సంబంధిత పత్రాలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విష్ణుప్రియ గురువారం ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో విద్యార్థులకు ఇన్నోవేషన్ ఇంటర్న్‌షిప్‌లు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు. కళాశాలలో ఉన్న టెక్నాలజీ సెంటర్ ఐడియా ల్యాబ్ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో అటానమస్ కళాశాలలో మొదటిసారిగా వాద్వానీ ఫౌండేషన్ తమ కళాశాలతో ఎంవోయూ చేసుకుందన్నారు.

ప్రజారక్షణకు అందరూ సహకరించాలి : సీఐ

భీమవరం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజారక్షణలో పోలీసులకు అందరూ సహకరించాలని రెండో పట్టణ సీఐ కాళీచరణ్ అన్నారు. ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నేరాలు జరిగినప్పుడు చూసినవారు నిర్భయంగా పోలీసులకు చెప్పినప్పుడు నేరస్తులను అదుపులోకి తీసుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ ప్రజారక్షణలో పోలీసులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ-విధి విధానాలపై 36 మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాస్, పి అమూల్యరావు, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూఎన్‌వో ఆవిర్భావ వేడుకలు

గణపవరం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి పరిరక్షణలో యూఎన్‌వో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మలకుమారి అన్నారు. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మధురాజు మాట్లాడుతూ యూఎన్‌వో దాని అనుబంధ సంస్థ ద్వారా విద్యా, వైజ్ఞానిక రంగాల్లో విశేష కృషి చేస్తుందన్నారు.

ఆధ్యాత్మికం




మద్దిరావమ్మను ఊరేగిస్తున్న భక్తులు
జాతరలో వేషధారణలు

ఘనంగా మద్దిరావమ్మ జాతర

కాళ్ళ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళ గ్రామంలో కొలువు తీరిన మద్దిరావమ్మ జాతర ఘనంగా గురువారం నిర్వహించారు. ప్రతీ మూడేళ్ళకు ఒకసారి గ్రామంలో నిర్వహించే జాతర సందర్భంగా గ్రామస్థులందరూ అమ్మవారి ఊరేగింపులో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు, యువకులు, గ్రామ పెద్దలు రోడ్లపైకి వచ్చి జాతరను తిలకించారు. జాతరలో ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, అఘోర వేషధారణలు ఆకట్టుకున్నాయి. తీన్మార్ డప్పులతో బాణసంచా కాల్చుతూ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు, బంధువులు పెద్ద ఎత్తున గ్రామానికి విచ్చేయడంతో సందడి నెలకొంది.

సాయిబాబా సన్నిధిలో అన్నసమారాధన

ఉండి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉండి కొత్తపేటలో వున్న సాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన జరిగింది. దాతలు సహకారంతో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ కునుకు రమాదేవిశ్రీను పూజలు చేశారు. పోలుబోతు రాము, పెద్దింటిబాబు పాల్గొన్నారు.











రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం

పోడూరు/నరసాపురం రూరల్/పెనుగొండ/ఆచంట, అక్టోబరు 24,(ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు అన్నారు. పోడూరు మండలంలో రీసర్వే జరిగిన వేడంగి, వేడంగిపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన రైతు గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సర్వే నంబర్ల నమోదు, పేర్లు నమోదులో జరిగిన తప్పొప్పులను రైతులు గ్రామసభల్లో దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ పోడూరు మండల అధ్యక్షుడు సూర్యనారాయణరాజు

తహసీల్దార్ ఎంఎస్.ఫాజిల్, ఆర్ఐ కుందుల రాంబాబు, కూటమి నాయకులు మేడిశెట్టి బుజ్జి, కుక్కల మునీంద్రరావు, జక్కంపూడి జయరామ్, మీసాల సత్యనారాయణ, గుడాల సత్యనారాయణ, పూతినీడి రంగారావు, గుడాల నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. నరసాపురం మండలం సీతారాంపురంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఏంఏకె కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి రీసర్వ సదసుసలో రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సర్పంచ్‌లు వెంకట్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో నాగేంద్ర, ఎస్.రామకృష్ణ రైతులు పాల్గొన్నారు. పెనుగొండ మండలం పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నక్కా శ్యామలాసోని శాస్త్రి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో 75 ఉపాధి హామీ పనులను గుర్తించామన్నారు. కార్యదర్శి టి.రత్నాకరావు, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. వడలి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారయణమూర్తి ఆధ్వర్యంలో సర్పంచ్ విజిట్ నిర్వహించి సిబ్బందితో పలు విషయాలు చర్చించారు. ఆచంట మండలం కందరవల్లిలో నిర్వహించిన గ్రామ సభలో 23 వినతులు వచ్చాయని రీ సర్వే డీటీ రాజ్యలక్ష్మి తెలిపారు. సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, ఆర్ఐ లక్ష్మి, వీఆర్వో బాలాజీ, రైతులు పాల్గొన్నారు.





ప్రతీ పంచాయతీని మూడు నెలలకోసారి తనిఖీ చేయాలి

పాలకొల్లు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌ల పరిధిలోని ప్రతీ గ్రామాన్ని మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా తనిఖీలు చేసి నివేదికలను అందజేయాలని విస్తరణాధికారులను నరసాపురం డీఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం పాలకొల్లు, యలమంచిలి, ఆచంట, నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన గ్రామ కార్యదర్శులు, గ్రేడ్-1, గ్రేడ్-5లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పన్నులు, పన్నేతర డిమాండ్ 2024-25 వసూళ్ళపై దృష్టి సారించాలన్నారు. పీఆర్ ఒన్ యాప్, మురుగు బోదెల శుభ్రం చేయడం, పచ్చిమొక్కలు తొలగించడం, తాగునీరు క్లోరినేషన్, ఐహెచ్ఎస్ఆర్ ట్యాంకులు నెలకు రెండు సార్లు శుభ్రం చేయడం, కోర్టు కేసులు, లే ఔట్లు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల వంటి పలు అంశాలపై ఆమె పలుసూచనలు చేశారు. మండలాల విస్తరణాధికారులు, ఎంఎల్‌సీఎస్, ఏవో తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ టీపీఎస్‌గా త్రినాథ్ బాధ్యతలు

నరసాపురం టౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి) మునిసిపల్ టీపీఎస్‌గా త్రినాథ్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పాలకొల్లు నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఈ పురపాలకంలో పనిచేసిన అనుభవం ఉంది. టీపీవోను ఇంతవరకు నియమించలేదు. ఈ పోస్టుతో పాటు మరో టీపీఎస్ పోస్టు కూడా ఖాళీగా ఉంది.





అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన

నరసాపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే నాయకర్ విచ్చేసి స్వాములకు భిక్ష వడ్డించారు. కోటిపల్లి వెంకటేశ్వరావు, నాని, తారక రామారావు, హనుమంతులు పాల్గొన్నారు.


పోలియో నిర్మూలనపై అవగాహన ర్యాలీ

పాలకొల్లు రూరల్/పాలకొల్లు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి జవ్వాజి కళ్యాణ్, కోశాధికారి పి.సత్యనారాయణ, పాస్ట్ ప్రెసిడెంట్ చందక రాము, మద్దాల వాసు, మైగాపుల రాంబాబు, సభ్యులు ముత్యాల శ్రీవత్సవ ప్రదీప్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.









నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మోదుగగుంట, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, జగన్నాథపురం, ఆరుగొలను, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి గురువారం తెలిపారు.

వైద్య సేవలపై అలసత్వం వహిస్తే సహించం..



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రోగులతో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఆస్పత్రిలో ఓ గర్భిణితో సిబ్బంది అలసత్వం వహించడంతో మంచంపైనే ప్రసవించిన ఘటనపై వచ్చిన కథనాలపై ఆయన ఆరా తీశారు. ఆయన ఆస్పత్రి తనిఖీ చేస్తుండగానే ఓ 80 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరితే ఏలూరు రిఫర్ చేయడాన్ని గమనించిన ఆయన సూపరింటిండెంట్ సూర్యనారాయణపై సీరియస్ అయ్యారు. ఆస్పత్రిలో రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

తణుకు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రాజీచేయగలిగిన వాటిని పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. కోర్టు ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే డిసెంబరు 14న ఉమ్మడి జిల్లాలో జరిగే అదాలత్‌లో రాజీపడు క్రిమినల్, చెక్ బౌన్సు, బ్యాంకు బకాయిలు, ప్రమాదాలు, కుటుంబ సభ్యులతో తగాదాలు, ఎంసీమెంటెన్సు కేసులు, గృహహింస, సివిల్, ప్రామిసరీ నోటు, ప్రీలిటికేషన్ కేసులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు.

ధాన్యంకు మద్దతు ధర అందిస్తాం..



మాట్లాడుతున్న నగేష్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు దళారుల బెడద లేకుండా వారు పండించిన పంటకు తగిన ధర అందించడమే అమృత భారత్ సంఘ చైర్మన్ కొండపల్లి నగేష్ పేర్కొన్నారు. మండలంలోని మాధవరంలో పోలేరమ్మ ఆలయం వద్ద గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సంఘ డైరెక్టర్ పైడికొండల సింధు, మాధవరం సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, మాజీ సర్పంచ్ కొలూరి పరిమళ, రైతులు బాలం కృష్ణ, గొపిశెట్టి భరతుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

తణుకు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం కోరుతూ ఈ నెల 28న విజయవాడలో తలపెట్టిన మహా విజ్ఞాన దీక్షను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు గత వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం బాధితులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. డిపాజిట్‌దారులకు న్యాయం జరిగేలా సమర్ధవంతమైన అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకోసం విజయవాడలో చేపట్టిన దీక్షలో అధిక సంఖ్యలో బాధితులు పాల్గొని సంఘ నాయకులు వై.నాగలక్ష్మి, బి.నాగరాజు, శ్రీనివాసు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టళ్లను సందర్శించిన అదనపు జిల్లా న్యాయాధికారి



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి విజయదుర్గా

భీమవరం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వ ర్యంలో 3వ అదనపు జిల్లా జడ్జి, సంస్థ చైర్మన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నర్సాపురం పదవ అదనపు జిల్లా జడ్జి, సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ స్థానిక బలుసుమూడిలో ఉన్న శ్రీవెంకటేశ్వర టీడీపీ బధిరుల పాఠశాలను గురువారం సందర్శించి పిల్లలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు కంటి సమస్యలు, దంత సమస్యలు, వినికిడి సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సంసకు తెలియజేస్తే సంబంధిత నిపుణులతో పరీక్షలు చేయిస్తామన్నారు. అనంతరం ఎల్ఐసీ ఆఫీసు పక్కన ఉన్న బీసీ గవర్నమెంట్ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌ను సందర్శించారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు బైక్ సైలెన్సర్ తీసి శబ్దాలు చేసుకుంటూ హాస్టల్ మీదుగా తిరుగుతున్నారని న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి వన్‌టౌన్ పోలీసులను ఆదేశించారు. ప్యానల్ న్యాయవాదులు పి.అంబేడ్కర్, కె.జ్యోతి, బి.లోకేశ్వరరావు, ఎన్.సుధీర్ పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఇరగవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కక్షపూరిత పాలనకు మోసపోయి బలైపోయిన బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అందులో భాగంగానే ప్రజాద ర్బార్ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తణుకు మున్సిప ల్ కార్యాలయ ంలో గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి వైసీపీ హయాంలో వారు ఎదుర్కొన్న సమస్య లను, బాధలను వినతిపత్రం రూపంలో ఎమ్మెల్యే రాధాకృష్ణకు అందజేసి వివరించారు. ఈ ఆర్జీలను అధికారులు పరిశీలించి బాధితులకు తక్షణమే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. ప్రజాదర్బార్‌కు 300 అర్జీలు వచ్చా యని ఆయన తెలిపారు. మునిసిపల్ కమిషన్ టి.రామ్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్త లు, ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యంత

తణుకు, అక్టోబరు24 (ఆంధ్ర జ్యోతి) : పోలియో రహిత సమాజమే లక్ష్యమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలియో చుక్కల ద్వారా 122 దేశాలకు ఏటా రూ.40 వేల కోట్లు రోటరీ ద్వారా వెచ్చించిందన్నారు. ర్యాలీలో క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థ, గమిని రాంబాబు, బసవా రామకృష్ణతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి 'అపార్' కార్డు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంఈఓ హనుమ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి అపార్ కార్డు అందించడం తప్పనిసరి అని ఎంఈవో వి.హనుమ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం పాఠశాల హెఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒకటే దేశం, ఒకటే నెంబర్ అనే నినాదంతో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ పై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థికి ప్రయివేటు, ప్రభుత్వం తేడా లేకుండా పాఠశాల, కళాశాల తేడా లేకుండా ఒకటే నెంబర్ ఉంటుందన్నారు. ఎంఈవో-2 వీఎంకే జ్యోతి, సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

» జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



భీమవరం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి గురువారం రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, సివిల్ సప్లై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. రైతు సహాయక కేంద్రాల్లో 25 శాతం బ్యాగులను భద్రపరుచుకోవాలని సూచించారు. వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను రైస్ మిల్లులు వద్ద వెహికల్ మానిటరింగ్ అధికారులుగా నియమించామన్నారు. వీరు కస్టోడియన్ అధికారుల సహకారంతో రైస్ మిల్లుల వద్దకు ధాన్యం దిగుమతికి వచ్చిన వాహనాలను మూడు గంటల లోపులో దిగుమతి చేయించే బాధ్యతను తీసుకుంటారన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కర రావు, ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వై.భవానీ శంకరి, సివిల్ సప్లైస్ డీఎం టి.శివరామకృష్ణ, డీఎస్‌వో ఎన్.సరోజ, ఏఎస్‌వో శివ, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

తణుకు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, తల్లిదండ్రులను, ఉపాధ్యా యులను గౌరవించాలని ఎస్ఐ కె.శ్రీని వాసు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీసు అవగా హన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తన కల్గి ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిసలయ్యి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. పోలీసులు, విద్యార్థులు మంచి స్నేహితులుగా ఉండాలని చెప్పారు. హెచ్ఎం పద్మావతి, మల్లిన రాధాకృష్ణ, జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కారుమూరి పరామర్శ

అత్తిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అత్తిలిలో యిర్రి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల సత్యనారాయణ సోదరి ముత్యాల పోలేశ్వరి మృతి చెందారు. గురువారం అత్తిలిలోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట మాజీ ఎఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీని వాస్, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్లపల్లి మణికుమార్, రామిశెట్టి రాము, యడ్లపల్లి దుర్గారావు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

అత్తిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరిగేడు, కొమ్మర, అత్తిలి, పాలూరు, ఈడూరు గ్రామాలలో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించారు. సచివాలయాలు, కొమ్మర జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎంపీడీవో పి.శామ్యూల్ పర్యవేక్షించారు. మండల విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఇరగవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. దోమల వ్యాప్తిని నివారించే పనులను గురువారం పట్టణంలోని కొమ్మాయిచెర్వు గట్టు వద్ద ప్రారంభించారు. పట్టణంలో ఎంపిక చేసిన 11 పాయింట్లలో వీటిని విడుదల చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. సబ్ యూనిట్ అధికారి గుడిమెట్ల వెంకటేశ్వరరావు, ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్న సమారాధన

అత్తిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా కె.సముద్రపుగట్టులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద గురువారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సం ఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

అయోడిన్ ఉప్పు వాడకంపై అవగాహన

అత్తిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిపురం శివారు శివపురంలో అయోడిన్ ఉప్పు వాడకంపై గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయోడిన్ ఉప్పు వల్ల బుద్ధి మాంద్యం హైపో థైరాయిడ్ వంటి సమస్యలను నివారించవచ్చని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం.శ్రీదేవి తెలిపారు. గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులు తప్పనిసరిగా ఐయోడిన్ తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాలను వండిన తరువాత దించే సమయంలో ఉప్పు వాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.మాధవి, తదితరులు పాల్గొన్నారు.